క్లుప్తంగా

నేడు వీఎంసీలో ప్రజా ఫిర్యాదులు - పరిష్కారం కార్యక్రమం

పటమట(విజయవాడతూర్పు): వీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదులు – పరిష్కారం కార్యక్రమంలో నగర వాసులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వచ్చి, పరిష్కరించుకోవాలని వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ మహేష్ తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో, చిట్టినగర్ సర్కిల్ – 1 కార్యాలయం సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు.

రైల్వే క్వార్టర్స్‌లో కూలిన బాల్కాని



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఇటీవల కురుస్తున్న వర్షాలకు విజయవాడ రైల్వే స్టేషన్ సమీపంలోని ఆర్‌ఈ రైల్వే కార్టర్స్‌లోని రెండవ అంతస్తు బాల్కాని ఒక్కసారిగా కుప్పకూలింది. అప్పటి వరకు అక్కడే పనులు చేసుకుంటున్న గ్రౌండ్‌ఫ్లోర్‌లోని మహిళ పక్కకు వెళ్లడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. సుమారు 45 ఏళ్ల క్రితం నిర్మాణం చేపట్టిన ఆర్‌ఈ కాలనీ టైప్–2లో జీ+3 భవన నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం అందులో 16 మంది రైల్వే కార్మికుల కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఆదివారం ఉదయం 723 బ్లాక్‌లోని ఒక నివాసంలోని బాల్కాని వర్షానికి నాని ఒక్కసారిగా కుప్పకూలింది. అప్పటి వరకు అక్కడే బట్టలు ఆరవేస్తున్న గ్రౌండ్‌ఫ్లోర్‌లోని మహిళ పక్కకు వెళ్లడంతో ప్రాణాలతో బయపడింది. క్వార్టర్స్ శిథిలావస్థకు చేరకున్నాయని, మరమ్మతులు చేపట్టాలని కాలనీ వాసులు అనేక సార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. ఇప్పటికైనా రైల్వే అధికారులు స్పందించి దెబ్బతిన్న క్వార్టర్స్‌కు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

చేయూత కార్యాలయం ప్రారంభం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రజాసమస్యల పరిష్కార వేదికగా 'చేయూత' కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని జిల్లా వినియోగదారుల కమిషన్ న్యాయమూర్తి చిరంజీవి నేలపూడి అన్నారు. మధురానగర్ షిర్డీ సాయిబాబా మందిరం సమీపంలో ఆదివారం 'చేయూత–సాంఘిక, సాంస్కృతిక సంక్షేమ సంఘం' ఆధ్వర్యాన ప్రజా సమస్యల పరిష్కారం కోసం 'చేయూత' కార్యాలయ ప్రారంభోత్సవం జరిగింది. చేయూత అధ్యక్షురాలు పిల్లి లక్ష్మీతులసి, ఎమ్మెల్సీ పరుచూరి అశోక్ బాబు, ఆంధ్రప్రదేశ్ పూర్వపు లా సెక్రటరీ సి.దుర్గాప్రసాద్, జిల్లా వినియోగదారుల కమిషన్ సభ్యులు అక్కిపెద్ది వెంకటరమణ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ఓఎస్‌డీ ఎం.వెంకటసుబ్బయ్య, పీవీఎల్‌ఎన్ రాజు పాల్గొన్నారు.

శిశువైద్యంలో భారత్ ప్రపంచానికే ఆదర్శం

పటమట(విజయవాడతూర్పు): శిశువైద్యంలో నూతన ఆవిష్కరణలతో భారత్ ప్రపంచానికే ఆదర్శంగా మారుతోందని రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ దినేష్ కుమార్ చిర్ల అన్నారు. విజయవాడలోని నోవోటెల్ హోటల్‌లో నియోనటల్ అండ్ పిడియాట్రిక్ ఎమర్జెన్సీస్ (ఎన్‌పీఈ) అంశంపై జాతీయ స్థాయి సదస్సు ఆదివారం నిర్వహించారు. ఈ సదస్సుకు దేశ వ్యాప్తంగా 400 మంది వైద్యులు హాజరయ్యారు. దినేష్ కుమార్ మాట్లాడుతూ శిశువైద్య నూతన ఆవిష్కరణల్లో భారతీయ వైద్యులు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. నూతన ఆవిష్కరణల సహకారంతో నిపుణులైన రెయిన్‌బో ఆస్పత్రి వైద్యులు గతేడాది 900 గ్రాముల బరువుతో జన్మించిన నవజాత శిశువుకు శస్త్ర చికిత్స చేసి పేస్ మేకర్‌ను విజయవంతంగా అమర్చారన్నారు. రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రాంప్రసాద్ మాట్లాడుతూ.. శిశువుల ప్రాణాలు కాపాడడంలో కార్పొరేట్ వైద్యశాలలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. డాక్టర్ శ్రీకాంత్, రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ యూనిట్ హెడ్ గుణశేఖర చౌదరి, డాక్టర్లు దినేష్ కుమార్, దుర్గాప్రసాద్, మల్లికార్జునరావు అనీల్ కుమార్, ఎస్.రాంప్రసాద్, వి.వంశీ శివరామరాజు, దుర్గా ప్రసాద్, డివిఎస్ శ్రీధర్, ఎన్.హేమకుమార్, పి.రమేష్ కుమార్, కె.శివసత్య ప్రసూన్ పాల్గొన్నారు.

కొండ రాయిపడి గాయపడిన మహిళకు సాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): వర్షాల కారణంగా కొండపై నుంచి పెద్ద కొండ రాయి జారి ఇంట్లోకి వచ్చిన ఘటనలో గాయపడిన మహిళ పిల్లా తులసికి ఎమ్మెల్యే సుజనా చౌదరి కార్యాలయం నుంచి ఆర్థిక సాయం అందజేశారు. విద్యాధరపురం కొట్టేటి కోటయ్య వీధి కొండ ప్రాంతంలో నివసిస్తున్న ఆమె ఇంటికి భవానీపురంలోని ఎన్డీఏ కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, బీజేపీ నాయకులు అడ్డూరి శ్రీరామ్ వెళ్లి పరామర్శించారు. అనంతరం బాధితురాలు తులసికి నగదు అందచేశారు. కొండ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పితాని పద్మ, తమ్మిన లీలా కరుణాకర్, మాజీ కార్పొరేటర్ షేక్ కరిముల్లా, సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గురు పౌర్ణమి వేడుకలు

- సాయి మందిరాలకు పోటెత్తిన భక్తులు
- భజనలు, అన్నదాన కార్యక్రమాల నిర్వహణ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లోని పలు ఆలయాల్లో గురు పౌర్ణమి వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. గురుపౌర్ణమిని పురస్కరించుకొని వన్‌టౌన్‌లోని సాయిబాబా మందిరాలు భక్తులతో పోటెత్తాయి. తెల్లవారుజాము నుంచి సాయిమందిరాల్లో స్వామివారికి పంచామృతాలు, వివిధ పళ్ల రసాలతో ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అఖండ సాయి నామసంకీర్తనలను చేపట్టారు. ఈ సందర్భంగా సాయి మందిరాలను పూలతో అత్యంత రమణీయంగా అలంకరించారు. దీంతో ఆలయాలు శోభాయమానంగా దర్శనమిచ్చాయి.

పండరీ సాయి మందిరంలో..

కొత్తపేట గణపతిరావురోడ్డులోని శ్రీ పండరీ సాయి మందిరంలో స్వామి వారికి ఉదయం నుంచి ప్రత్యేక అర్చనలను నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా స్వామివారిని, ఆలయ ప్రాంగణాన్ని అత్యంత సుందరంగా అలంకరించారు. ఆలయ ధర్మకర్త నాగోతి వెంకటరామకృష్ణ కార్యక్రమాలను పర్యవేక్షించారు. పాండురంగస్వామి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.



నెహ్రూబొమ్మ సెంటర్‌లో పూజల్లో పాల్గొన్న నాయకులు



హెచ్‌బీ కాలనీలో బాబా విగ్రహానికి చెరుకు రసంతో అభిషేకం చేస్తున్న పాలక మండలి సభ్యులు



కరకట్ట సౌత్ రోడ్డులో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

దుర్గమ్మ సన్నిధిలో వేడుకలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఆషాఢ పౌర్ణమి(గురు పౌర్ణమి)ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో ఆలయ వేద పండితులు శ్వావస్య మహర్షి దంపతులకు ఆలయ ఈవో కె.ఎస్.రామరావు సమక్షంలో గురు పూజ, గురు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయ ఈవో రామరావు వేద పండితులు శ్వావస్య మహర్షికి పాదాభివందనం చేసి ఆశీస్సులు అందుకున్నారు. గురుపూజా మహోత్సవంలో భాగంగా వేద పండితులను శాలువాతో సత్కరించి, పండ్లు, నూతన వస్త్రాలను సమర్పించడంతో పాటు అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలను అందజేశారు.



వేద పండితులకు పాదాభివందనం చేస్తున్న ఈవో రామరావు

పలు ఆలయాల్లో

నెహ్రూబొమ్మ సెంటర్‌లోని సాయి మందిరంలో భక్తులు పోటెత్తారు. గురు పౌర్ణమిని పురస్కరించుకొని ఉదయం బాబావారికి ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. అనంతరం బాబాకు ప్రత్యేక అలంకారం చేసి, విశేష పూజలు నిర్వహించారు. ఆలయంలో భక్తులకు ప్రత్యేక ప్రసాద వితరణ, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేక దీపాలంకరణ చేశారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త పర్యవేక్షించారు. స్థానిక కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్ పూజలు నిర్వహించారు. సాయి ప్రతిమకు అన్నాభిషకాన్ని నిర్వహించారు. పాతశివాలయం ప్రాంగణంలో కొలువై ఉన్న శ్రీ దత్తాత్రేయస్వామి వారి సన్నిధిలో ఆదివారం గురు పౌర్ణమిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు జరిగాయి.

శ్రీ సాయి ప్రేమ మండలి ఆధ్వర్యంలో..

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని శ్రీ సాయి ప్రేమ మండలి వారి ఆధ్వర్యంలో ఆదివారం గురు పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక కృష్ణవేణి హోల్‌సేల్ క్లాత్ మార్కెట్ ప్రాంగణంలో వేడుకలను జరిపారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా షిర్డీ సాయినాథుడిని కొలువుతీర్చి షిర్డీలో జరిగే సంప్రదాయం ప్రకారం ఉదయం కాకడ హారతి, పంచామృతాలతో అభిషేకం, 58 మంది దంపతులతో సామూహికంగా శ్రీ సాయి సత్య వ్రతాలు నిర్వహించారు. మధ్యాహ్నం హారతి నిర్వహించి భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. సాయంత్రం దుప్ హారతి, రాత్రి సెజ్ హారతి ఇచ్చి బాబా వారికీ పూజ కార్యక్రమాలు ముగించారు. కార్యక్రమ నిర్వాహకులు బొందిలి ఖాజాసింగ్, సుంకర రాంబాబు మాట్లాడుతూ ప్రతి ఏటా మాదిరిగా బాబా వారికీ ప్రత్యక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శ్రీ సాయి ప్రేమ మండలి సభ్యులు కామరాజు హరీష్ కుమార్, చంద్రమౌళి, చంద్రమోహన్, పృథ్వీ, కృష్ణవేణి క్లాత్ మార్కెట్ అధ్యక్షుడు బచ్చు వెంకట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భవానీపురంలో అభిషేకాలు, పూజలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): గురు పౌర్ణమిని పర్వదినాన్ని పురస్కరించుకుని గట్టు వెనుక ప్రాంతంలోని పలు సాయిబాబా ఆలయాల్లో సాయినాథుడికి అభిషేకాలు, పూజలు అత్యంత వైభవంగా జరిగాయి. భవానీపురం హౌసింగ్‌బోర్డ్ కాలనీ(పాత)లో గల సంకల్పసిద్ధి షిర్డీ సాయిబాబా మందిరంలో మూడు రోజులపాటు తలపెట్టిన గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా ఆదివారం వేకువ జామున 5.30 గంటలకు బాబాను పంచామృతాలతో అభిషేకించారు. తరువాత పుష్పాలతో సహస్రనామార్చన గావించారు. ఉదయం 10 గంటలకు బాబావారికి అన్నాభిషేకం, హారతి, మధ్యాహ్నం 12.30 గంటలకు 10 వేల మందికి అన్న ప్రసాద వితరణ జరిగాయి. సాయంత్రం 5 గంటలకు మంగళ వాయిద్యాలు, విద్యుత్ దీప కాంతుల నడుమ పురవీధుల్లో షిర్డీ సాయిబాబా ఊరేగింపు కనుల పండువగా జరిగింది. కార్యక్రమాన్ని ఆలయ పాలకవర్గం అధ్యక్ష, ఉపాధ్యక్షులు బూర్లె వెంకటేశ్వరరావు, మోటుమర్రి సుబ్బారావు, కోశాధికారి చందలూరి రాజశేఖర్, కార్యదర్శులు పీవీఎల్ ప్రసాద్, గుడివాడ విజయ కుమార్, సభ్యులు పి.రజనీకాంత్, యెనిగళ్ల సుబ్బారావు, జీవీ కృష్ణ, సాయి సేవకులు పర్యవేక్షించారు.

శ్రీదత్త సాయి భరద్వాజ సత్సంగ మందిరంలో

భవానీపురం టీచర్స్ కాలనీలోగల శ్రీదత్త సాయి భరద్వాజ సత్సంగ మందిరంలో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. కాకడ హారతి, అభిషేకం, పూజా హారతి, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. సాయంత్రం దత్త స్వామికి పూజ, సత్సంగం, దీపాలంకరణ, బాబా పల్లకి సేవ, శేజ్ హారతితో వేడుకలు ముగిశాయి.

కరకట్టపై సాయిబాబా మందిరంలో

భవానీపురం కరకట్ట సౌత్ రోడ్‌లోని శ్రీదాసాంజనేయ సహిత షిర్డీ సాయిబాబా, ఉమా రామలింగేశ్వర స్వామివార్ల మందిరంలో గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా చివరి రోజు ఆదివారం ఉదయం 9 గంటలకు పూర్ణాహుతి కార్యక్రమం జరిగింది. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, సాయంత్రం సాయి పల్లకీ సేవ ఘనంగా నిర్వహించారు. పూజలను గురుజాడ బాల చంద్రశేఖర శర్మ నిర్వహించగా ఆలయ ధర్మకర్త పాములపాటి దుర్గాప్రసాద్, మధుబాల దంపతులు పాల్గొన్నారు.



పాత శివాలయంలో దత్తాత్రేయుడికి పూజలు



టీచర్స్‌కాలనీలోని పూజలందుకున్న దత్తాత్రేయుడు



ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు

కొండ ప్రాంత వాసులను పునరావాస కేంద్రాలకు తరలించండి

వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ మహేష్

పటమట(విజయవాడతూర్పు): ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కొండ చరియలు విరిగిపడే అవకాశం ఉన్నందున ఆయా ప్రాంతాల్లో ఉన్న వారందరినీ వీఎంసీ ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ మహేష్ ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా నగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరంగా కురుస్తున్న వర్షం కారణంగా కొండ ప్రాంతంలోని గోడలు నాని పగిలిపోవడం వలన కొండ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలకు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. వారందరినీ పట్టణ ప్రణాళిక విభాగం, వార్డు ప్లానింగ్, ఎమినిటీస్ కార్యదర్శులు కొండ ప్రాంతంలో ఉన్న ప్రజల వద్దకు వెళ్లి, వాళ్లకు కలిగే ఆపద గురించి చెప్పడమే కాకుండా వారిని అక్కడ నుంచి పునరావస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు.

సి.రామ్మోహనరావు సేవలు వెలకట్టలేనివి

విజయవాడ కల్చరల్: రేడియో నాటక నటుడు, దర్శకుడు సి.రామ్మోహనరావు సేవలు వెలకట్టలేనివని పౌరాణిక రంగస్థల నటుడు పిల్లుట్ల లక్ష్మీకాంత శర్మ అన్నారు. కళామంజరి సాంస్కృతిక సేవా సంస్థ, సి.రామ్మోహనరావు కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సి.రామ్మోహనరావు 34వ వర్ధంతి, జిల్లా స్థాయి రంగస్థల కళాకారుల ఆత్మీయ సమావేశం గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికపై ఆదివారం నిర్వహించారు. లక్ష్మీకాంత శర్మ మాట్లాడుతూ సి.రామ్మోహనరావు సుదీర్ఘకాలం విజయవాడ ఆకాశవాణి కేంద్రంలో పనిచేసి ఎంతో మంది ప్రముఖులను రేడియో ద్వారా పరిచయం చేశారన్నారు. సి.రామ్మోహనరావు కల్చరల్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు హరగోపాల్ మాట్లాడుతూ.. విజయవాడ కేంద్రం అనౌన్సర్‌గా ఆయన పని చేశారన్నారు. సి.రామ్మోహనరావుతో ఉన్న అనుబంధాన్ని ఆచంట బాలాజీనాయుడు, పీవీఎల్ నృసింహం, శింగంపల్లి వెంకటరమణ, పిల్లుట్ల నిరంజన్, మాడుగుల రామకృష్ణ గుర్తు చేసుకున్నారు.



నివాళులర్పిస్తున్న నాటక రంగ ప్రముఖులు

అగ్రి ఇన్‌పుట్స్ మాన్యుఫ్యాక్చర్స్ అండ్ మార్కెటింగ్ అసోసియేషన్ కార్యవర్గం

మధురానగర్(విజయవాడసెంట్రల్): అగ్రి ఇన్‌పుట్స్ మాన్యుఫ్యాక్చర్స్ అండ్ మార్కెటింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక ఆదివారం ఏకగ్రీవమైంది. విజయవాడలో ఆదివారం అసోసియేషన్ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీ గౌరవాధ్యక్షుడిగా సి.పీటర్‌పాల్, అధ్యక్షుడిగా ఎ.నాగేశ్వరరావు, కార్యదర్శిగా పి.కృష్ణప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా ఎ.హరికృష్ణ, ఉపాధ్యక్షుడిగా జి.జగదీష్, కోశాధికారిగా ఎం.మోహనరావు ఎన్నికయ్యారు. అనంతరం అసోసియేషన్ కార్యదర్శి కృష్ణప్రసాద్ బయోస్టిములెంట్స్ ప్రాధాన్యం, ప్రభుత్వ విధి, విధానాలను వివరించారు.



మాట్లాడుతున్న అసోసియేషన్ నేతలు

హౌసింగ్ సొసైటీ అక్రమాలపై విచారణ చేపట్టాలి

శ్రీహరిపురం గవర్నమెంట్ ఎంప్లాయిస్ కోఆపరేటివ్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల గృహ నిర్మాణ సంఘంలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలని శ్రీహరిపురం గవర్నమెంట్ ఎంప్లాయిస్ కోఆపరేటివ్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం అసోసియేషన్ సమావేశం జరిగింది. సమావేశంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వి.శ్రీనివాస్, వి.రత్నప్రసాద్ మాట్లాడుతూ హౌసింగ్ సొసైటీ మేనేజింగ్ కమిటీ అవినీతి అక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు. 2016లో కోఆపరేటివ్ చట్టం ద్వారా హౌసింగ్ సొసైటీ ఏర్పాటైందన్నారు. ఐసీడీఎస్ మాజీ ఉద్యోగులు అడ్డాల సుబ్బరాజు, నాదెండ్ల విశ్వనాథం సొసైటీ ఏర్పాటు చేసి 2019లో ఇబ్రహీంపట్నం మండలం కేతనకొండలో 85 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. ఏపీసీఆర్‌డీఏ అనుమతితో లేఅవుట్ వేసి 825 ప్లాట్లుగా విభజించారు. వీటిలో 653 ప్లాట్లు చదరపు గజం రూ. 12వేల ధరకు విక్రయించారని, మార్టిగేజ్ చేసిన 72 ప్లాట్లు అడ్వాన్సులు సేకరించారు. సభ్యులకు తెలియకుండా ఏక పక్షంగా తీర్మానాలు చేయడం, రూ. 2లు అధిక వడ్డీకి రుణాలు తెచ్చి సొసైటీపై భారం మోపారన్నారు. ప్రభుత్వం స్పందించి హౌసింగ్ సొసైటీ మేనేజింగ్ కమిటీ అక్రమాలపై విచారణ జరపాలన్నారు. సభ్యులకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన శాకంబరీదేవి ఉత్సవాలు



పాత శివాలయంలో భ్రమరాంబ అమ్మవారు



శాకంబరీదేవిగా గంగానమ్మ అమ్మవారు



శాకంబరీ అలంకరణలో గంగానమ్మ అమ్మ వారు



మహాలక్ష్మి అమ్మవారికి పండ్లతో అలంకరణ

చిట్టినగర్/వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నియోజకవర్గంలోని వివిధ ఆలయాల్లో శాకంబరీదేవి ఉత్సవాలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. అమ్మ వార్లను, ఆలయాలను కూరగాయలు, ఆకుకూరలతో విశేషంగా అలంకరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆయా ఆలయాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి పూజలు చేశారు. ఆదివారం పూర్ణాహుతి కార్యక్రమాలతో శాకంబరీ ఉత్సవాలకు ముగింపు పలికారు.

నేత్రపర్వంగా వెంకన్నకు గరుడ సేవ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పౌర్ణమిని పురస్కరించుకొని వెంకన్న స్వామికి గరుడ సేవ ఉత్సవాన్ని ఆదివారం రాత్రి నేత్రపర్వంగా నిర్వహించారు. పాతబస్తీలోని పురాతన ఆలయమైన శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఆషాఢ మాసం పౌర్ణమిని పురస్కరించుకొని గరుడ సేవ జరిగింది. ఈ సందర్భంగా స్వామి వారికి పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపారు. ప్రతి నెలా పౌర్ణమి రోజున స్వామి వారికి గరుడ వాహన సేవను నిర్వహించటం ఆనవాయితీ. అందులో భాగంగా గరుడ వాహనంపై వెంకటేశ్వరస్వామి వారి ఉత్సవమూర్తులను అధిష్ఠింపజేశారు. స్వామి వారి గరుడ ఉత్సవం నేత్రపర్వంగా సాగింది. వైదిక కార్యక్రమాలను ఆలయ పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి, దీక్షితులు నిర్వహించగా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.



ఇంద్రకీలాద్రిపై కోలాహలం

ఇంద్రకీలాద్రిపై ఆదివారం భక్తజన కోలాహలం నెలకొంది. ఆషాఢ మాసం సారెల సమర్పణతో పాటు శాకంబరీదేవి ఉత్సవాల ముగింపు సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఆరో అంతస్తులో సారె సమర్పించి, అమ్మ వారిని దర్శించుకున్నారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





9 కాసుల బంగారం, రూ.1.27 లక్షల నగదు చోరీ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలోని 9 కాసుల బంగారపు వస్తువులు, రూ. 1.27 లక్షల నగదు చోరీ చేసిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అంబాపురం పి. నైనవరంలో అల్లంపల్లి మణికంఠ కుటుంబం నివాసం ఉంటుంది. మణికంఠ కబేళా సెంటర్‌లోని గ్రీజ్ కంపెనీలో పని చేస్తుంటాడు. శనివారం ఉదయం మణికంఠ భార్య, పిల్లలను తమ్ముడు వరసయ్యే అనిల్‌కుమార్ ఇంటి వద్ద దింపి తాను పనికి వెళ్లాడు. శనివారం రాత్రి కూడా అక్కడే ఉండి ఆదివారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చారు. ఇంటికి వచ్చే సరికి తలుపులకు వేసి ఉన్న తాళాలు పగలగొట్టి లోపల సామగ్రి అంతా చిందర వందరగా పడేసి కనిపించాయి. దీంతో లోపలకు వెళ్లి చూసే సరికి బీరువాలో ఉండాల్సిన 9 కాసుల బంగారపు వస్తువులు, వెండి సామగ్రితో పాటు రూ. 1.27 లక్షల నగదు కనిపించలేదు. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు ఘటనా స్థలానికి చేరుకుని నిందితుడి వేలిముద్రలను సేకరించారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.